సాక్షి అనంతపురం

ఆదివారం । 12 । అక్టోబర్ । 2025



టన్ను చీనీ రూ.15 వేలు

అనంతపురం మార్కెట్ యార్డులో శనివారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.15 వేలు, కనిష్టంగా రూ.8 వేల ప్రకారం ధర పలికాయి.



అణగారిన వర్గాల ఆశాజ్యోతి జగన్

అణగారిన వర్గాల ఆశాజ్యోతి వైఎస్ జగన్ అని వక్తలు కొనియాడారు. శనివారం అనంతపురంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. 8లో

గరిష్టం/కనిష్టం

34.8°/21.6°

జిల్లా అంతటా శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 14 కి.మీ వేగంతో ఈశాన్యం నుంచి నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

రేపు కలెక్టరేట్‌లో పరిష్కార వేదిక



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆనంద్ (ఫైల్)

అనంతపురం అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఈనెల 13న కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఓ.ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ భవన్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలను అర్జీ రూపంలో అధికారులకు సమర్పించాలన్నారు. గతంలో అర్జీ ఇచ్చి ఉంటే దానికి సంబంధించి రసీదు తీసుకురావాలన్నారు. సమర్పించిన అర్జీ పరిష్కార స్థితి ఏ దశలో ఉందనే విషయాన్ని కాల్‌సెంటర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. ప్రజలు తమ అర్జీలను పరిష్కార వేదిక ద్వారానే కాకుండా meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఆన్‌లైన్‌లోనూ సమర్పించవచ్చని తెలియజేశారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

కొనసాగుతున్న నెట్‌వర్క్ ఆస్పత్రుల సమ్మె

- ప్రత్యక్ష నరకం చూస్తున్న రోగులు

అనంతపురం మెడికల్: కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో పేదలు ప్రత్యక్ష నరకం చూస్తున్నారు. ఎన్‌టీఆర్ వైద్య సేవ పరిధిలో ఉన్న ఆస్పత్రులు సమ్మె కొనసాగిస్తుండడం రోగులు, క్షతగాత్రులకు శాపంగా మారింది. సమ్మెలో భాగంగా జిల్లాలో 90 శాతం నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో అన్ని రకాల సేవలను నిలిపివేశారు. కేవలం కొన్ని కార్పొరేట్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు మాత్రం అత్యవసర కేసులను తీసుకుంటున్నారు. అది కూడా ప్రీ ఆథరేజేషన్ (ముందస్తు నిర్ధారణ) కేసులనే తీసుకుంటున్న పరిస్థితి నెలకొంది. జిల్లాలో 230 మంది డయాలసిస్, 70 మంది వరకు కేన్సర్ రోగులుండగా.. ప్రీ ఆథరైజేషన్ చేయాలంటే వారికి చుక్కలు కనబడుతున్నాయి. మరోవైపు తీవ్ర ప్రమాదకర కేసులకు ప్రభుత్వ సర్వజనాస్పత్రే దిక్కుగా మారింది. ఇప్పటికే సర్వజనాస్పత్రికి రోగుల తాకిడి ఎక్కువై సేవలు సకాలంలో అందడం లేదు. తాజాగా బిల్లుల చెల్లింపులో కూటమి సర్కారు నిర్లక్ష్య వైఖరి కారణంగా ఎన్టీఆర్ వైద్య సేవలు నిలిచిపోవడంతో పేదలకు కష్టాలు తప్పడం లేదు.

ఈ-కేవైసీ చేయించుకోండి



ఈ-కేవైసీని పరిశీలిస్తున్న పీడీ సలీం బాషా

కూడేరు: ఉపాధి కూలీలందరూ తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ (డ్వామా పీడీ) సలీం బాషా సూచించారు. శనివారం కూడేరు మండల పరిధిలోని ముద్దలాపురం, కూడేరు, అరవకూరు, కమ్మూరు గ్రామాల్లో పీడీ పర్యటించారు. జాబ్ కార్డు కలిగిన వ్యక్తులు, కూలీలకు చేస్తున్న ఈ-కేవైసీ ప్రక్రియను క్షేత్ర స్థాయిలో ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ -కేవైసీ చేయించుకుంటేనే పనులు చేసిన తర్వాత బిల్లు పెట్టేందుకు వీలుంటుందన్నారు. కార్యక్రమంలో ఏపీఓ పోలేరయ్య తదితరులు పాల్గొన్నారు.

‘పీఎండీడీకే’తో వ్యవసాయాభివృద్ధి

అనంతపురం అర్బన్: ప్రధానమంత్రి ధన్-ధాన్య కృషి (పీఎండీడీకే) యోజనతో వ్యవసాయపరంగా జిల్లా సమగ్ర అభివృద్ధి సాధిస్తుందని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, కలెక్టర్ ఓ.ఆనంద్ అన్నారు. శనివారం న్యూ ఢిల్లీలోని నేషనల్ అగ్రికల్చరల్ సైన్స్ కాంప్లెక్స్ నుంచి ప్రధాన మంత్రి ధన్-ధాన్య కృషి యోజన పథకం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాల్గొని మాట్లాడారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్ నుంచి ఎంపీ అంబికా, కలెక్టర్ ఓ.ఆనంద్, తదితరులు కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం వారు మాట్లాడుతూ పీఎం ధన్-ధాన్య కృషి యోజన పథకం కింద దేశంలో 100 జిల్లాలను కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిందని, ఆ జాబితాలో రాష్ట్రం నుంచి జిల్లాతో పాటు శ్రీ సత్యసాయి, అల్లూరి సీతారామరాజు, అన్నమయ్య జిల్లాలు ఉన్నాయన్నారు. వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించడం, పంటల వైవిధ్యం, స్థిరమైన వ్యవసాయ పద్ధతులు, పంట అనంతర నిల్వ, విలువ జోడింపు, నీటి పారుదల సౌకర్యాలు మెరుగుపర్చడం, దీర్ఘ, స్వల్పకాలిక క్రెడిట్‌ను సులభతరం చేయడం తదితర లక్ష్యాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్ కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజు కాదు.. పచ్చబంటు

అంతా నా ఇష్టం!

- అధికార పార్టీకి తొత్తులా కూడేరు సీఐ రాజు వ్యవహారం
- పోలీస్ స్టేషన్‌ను టీడీపీ కార్యాలయంగా మార్చిన వైనం
- వైఎస్సార్ సీపీ నేతలపై ఇష్టారాజ్యంగా కేసుల బనాయింపు
- పట్టనట్లుంటున్న పోలీసు ఉన్నతాధికారులపై సర్వత్రా విమర్శలు



సీఐ రాజు



- చిత్రంలో పచ్చ కండువాలు వేసుకున్న వారితో కళకళలాడుతూ కనిపిస్తున్నది టీడీపీ కార్యాలయం అనుకుంటే మీరు పొరబడినట్లే. కూడేరు అప్‌గ్రేడ్ పోలీసుస్టేషన్ ఇది. ఇటీవల కూడేరు మండలంలోని ముద్దలాపురంలో టీడీపీ, వైఎస్సార్ సీపీలకు చెందిన ఇరు కుటుంబాల మధ్య గొడవ జరిగింది. టీడీపీ నాయకుడు దీనిపై కూడేరు పోలీసుస్టేషన్‌లో కేసు పెట్టాడు. ఈ క్రమంలో ఇరువర్గాలనూ విచారించి న్యాయం చేయాల్సిన సీఐ రాజు ఏకపక్షంగా వ్యవహరించారు. టీడీపీ కండువా వేసుకుంటే వదిలేస్తానని వైఎస్సార్ సీపీ నాయకులను హెచ్చరించినట్లు తెలిసింది. ఆయన చెప్పిన మేరకు కండువాలు వేసుకున్నాక వారంతా వచ్చి ఇదిగో ఇలా కూడేరు అప్‌గ్రేడ్ పోలీసుస్టేషన్‌లోనే ఫొటోలకు ఫోజులిచ్చారు. దీన్ని బట్టి ఇక్కడ సీఐ రాజు వ్యవహార శైలి ఎలా ఉందో, అధికార పార్టీ సేవలో ఆయన ఎంతలా తరిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.

కూడేరు: ‘పచ్చ’ కండువా వేసుకున్న వాళ్లతోనే ఆయన మాట్లాడతారు. లేకుంటే వేధింపులకు గురిచేస్తారు. ఉన్నతాధికారులకు ఆయన గురించి తెలిసినా పట్టించుకోకపోవడంతో ఇక ఎదురే లేదంటూ రెచ్చిపోతున్నారు. కూడేరు అప్‌గ్రేడ్ పోలీసు స్టేషన్ సీఐ రాజు వ్యవహార శైలి ‘నేనే రాజు.. నేనే మంత్రి’ అన్న తరహాలో ఉంటోంది. టీడీపీ నేతలకు జీ హుజూర్ అంటూ వారి సేవలో తరిస్తున్నారు. ఏకంగా పోలీసు స్టేషన్‌ను ‘పచ్చ’ కార్యాలయంగా మార్చేశారనే ఆరోపణలున్నాయి. సీఐ రాజు తీరుతో పోలీసు వ్యవస్థపైనే మండల ప్రజల్లో నమ్మకం పోయిందంటే అతిశయోక్తి కాదు.

ఆది నుంచి అంతే..

సీఐగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచే రాజు వ్యవహార శైలి వివాదాస్పదంగా మారింది. ఆయన వేధింపులను తట్టుకోలేని పలువురు బాధితులు ఇప్పటికే ఉన్నతాధిరులకు కూడా ఫిర్యాదులు చేశారు. ఓ పార్టీకి కొమ్ముకాస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న సీఐ రాజుపై తన పోలీసుస్టేషన్‌లోనే పనిచేసే కొందరు సిబ్బంది అసంతృప్తిగా ఉన్నట్లు తెలిసింది. ఇంత జరుగుతున్నా ఉన్నతాధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

అక్రమంగా కేసు కట్టారు



కడదరకుంట రెవెన్యూ పొలం సర్వే నంబర్లు 122,123,124లో మాకు వ్యవసాయ భూమి ఉంది. భూమిలోకి వెళ్లేందుకు ఉన్న రస్తాని టీడీపీ నాయకులు వడ్డే ఆంజనేయులు ఆక్రమించాడు. దీనిపై మేము రెవెన్యూ అధికారులను ఆశ్రయిస్తే రికార్డులు పరిశీలించి రస్తా ఉందని వారు తేల్చారు. 2023లో ఉపాధి హామీ పథకం ద్వారా రోడ్డు పనులు కూడా చేశారు. అయినా, అవతలి పక్షం వారి ఫిర్యాదుతో సీఐ రాజు నాపైనే కేసు కట్టి వేధిస్తున్నారు.

– కురుబ రామచంద్ర, కడదరకుంట, కూడేరు మండలం

ఎస్పీకి ఫిర్యాదు చేశాం



మేం ఐదుగురం అన్నదమ్ములం. 2000 సంవత్సరంలో పెద్దమనుషుల సమక్షంలో మిగిలిన ముగ్గురు అన్నదమ్ములు సమ్మతించడంతో సర్వే నంబర్ 486లో నా పేరిట 4 ఎకరాలు, లక్ష్మీనారాయణ రెడ్డి పేరిట 4 ఎకరాలు భాగపరిష్కారం చేసుకున్నాం. అయితే, ఇటీవల మా అన్న మోహన్ రెడ్డి భూమిలో ఎకరా ఇవ్వాలంటూ దౌర్జన్యంగా పొలంలో స్టార్టర్ పెట్టి పగలగొట్టి నా తమ్ముడు లక్ష్మినారాయణరెడ్డిపై దాడి చేశాడు. దీంతో అతనిపై కేసు పెట్టాం. అయితే, మా అన్న టీడీపీ కావడంతో అతనిపై చర్యలు తీసుకోకుండా నాపైనే సీఐ రాజు దురుసుగా ప్రవర్తించారు. దీనిపై ఎస్పీకి ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదు. – బైరెడ్డి రామచంద్రా రెడ్డి, జల్లిపల్లి

వేరే చోట ఉన్నా కేసు కట్టారు



ఇటీవల మా వదిన, పక్కింటి ఆమె గొడవ పడ్డారు. పక్కింటామె స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే మేము వైఎస్సార్ సీపీ అని సీఐ రాజు ఉద్దేశ పూర్వకంగా మావాళ్లు తొమ్మిది మందిపై కేసు కట్టారు. వేరే ప్రాంతంలో చదువుకుంటున్న అమ్మాయిపై కూడా కేసు నమోదు చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు స్టేషన్‌లోనే అందరినీ పెట్టుకున్నారు. మహిళలు ఘర్షణ పడితే ఇంత మందిపై కేసు ఎందుకు కడుతున్నారని అడిగినా వినిపించుకోలేదు. అవతలి వైపు వారు టీడీపీ కావడంతో వారు చెప్పినట్టు సీఐ విని ఇబ్బందులకు గురి చేశారు. వారిపై మేము ఫిర్యాదును చేసినా తీసుకోలేదు. – రమేష్ నాయక్, ఉదిరిపికొండ తండా, కూడేరు మండలం

కోటి సంతకాల ఉద్యమాన్ని విజయవంతం చేయాలి



వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్తలు, రాష్ట్ర కార్యదర్శులతో సమావేశమైన నరేష్ కుమార్ రెడ్డి

అనంతపురం: మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ తలపెట్టిన కోటి సంతకాల ప్రజా ఉద్యమాన్ని విజయవంతం చేయాలని అనంతపురం పార్లమెంట్ పార్టీ పరిశీలకుడు బి. నరేష్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తలు, రాష్ట్ర కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామి రెడ్డి, నియోజకవర్గాల సమన్వయకర్తలు సాకే శైలజానాథ్, డాక్టర్ తలారి రంగయ్య, వై. విశ్వేశ్వర రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు ఎల్ఎం మోహన్ రెడ్డి, నార్పల సత్యనారాయణ రెడ్డి, రమేష్ రెడ్డి, బోయ తిప్పేస్వామి, మహేంద్రనాథ్ రెడ్డి హాజరయ్యారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన కోటి సంతకాల ప్రజా ఉద్యమంపై సమాలోచన చేశారు. ఈ సందర్భంగా నరేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాదిన్నరలోనే తీవ్ర ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజెప్పాలన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణతో జరిగే నష్టాల గురించి గ్రామ స్థాయి నుంచే ప్రజలకు వివరించాలన్నారు. డాక్టర్ కావాలనే రిజర్వేషన్ వర్గాల కలను చిదిమేసిన సంగతి ప్రజలకు తెలియజెప్పాలని కోరారు. ఈ నెల 28న నియోజకవర్గ కేంద్రాల్లో చేపట్టే ర్యాలీలో అందరినీ భాగస్వాములను చేయాలన్నారు. నవంబర్ 12న జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ చేపట్టాలన్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీ కమిటీల ఏర్పాటును త్వరగా పూర్తి చేయాలన్నారు. కోటి సంతకాల సేకరణలో పార్టీ అనుబంధ సంఘాలు చురుగ్గా పాల్గొనాలని సూచించారు.

రైతులను ఆదుకునే మనసు లేదా?

- కరువు రక్కసితో అన్నదాతల కుదేలు
- ఇన్‌పుట్, ఇన్సూరెన్స్ అందించడంలో ప్రభుత్వం విఫలం
- ఇప్పటిదాకా కనీసం ఐఏబీ సమావేశం నిర్వహించలేదు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామి రెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత

అనంతపురం: ‘చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిపోయింది. ముఖ్యంగా జిల్లాలో కరువు ఛాయలు కమ్ముకున్నాయి. రైతుల కష్టాలు దయనీయంగా మారాయి’ అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామి రెడ్డి అన్నారు. శనివారం ఆయన వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రైతుల కష్టాలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ప్రజాప్రతినిధులకు చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. ఈ ప్రభుత్వంలో ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదని, దీంతో రైతులు పండించిన పంటలను రోడ్లపై పడేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక గత ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లలో పెద్ద ఎత్తున రైతులు నష్టపోయారన్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావం నెలకొని వారి వేదన వర్ణనాతీతంగా మారిందన్నారు. వేరుశనగ, పత్తి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని చెప్పారు.

గతంలో ఎప్పుడూ లేదు..

జిల్లాలో ప్రధాన పంట వేరుశనగ 4.50 లక్షల ఎకరాల్లో సాగవ్వాల్సి ఉన్నా కేవలం 2.25 లక్షల ఎకరాల్లో సాగు చేశారని గుర్తు చేశారు. ఆగస్టులో ఆలస్యంగా వర్షాలు కురిస్తే భూమి బీడు పెట్టలేక జొన్న, సజ్జ, కొర్రలు వేశారన్నారు. ఖరీఫ్ సీజన్‌లో కేవలం 28 రెయిన్‌డేస్ నమోదయ్యాయని, గతంలో ఇలాంటి పరిస్థితి ఎన్నడూ తలెత్తలేదన్నారు. ఖరీఫ్‌లో సాగు చేసిన వేరుశనగ పంటకు ఇటీవల తెగుళ్లు ఆశించడంతో దిగుబడి కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. కేవలం వేరుశనగ సాగు కోసమే రైతులు రూ.450 కోట్ల పెట్టుబడి పెట్టారని, దిగుబడి కూడా రాకపోవడంతో వారికి నేడు దిక్కుతోచడం లేదన్నారు. సీజన్ ముగిసినా జిల్లాలో ఈ-క్రాప్ బుకింగ్ 50 శాతం కాకపోవడంతో ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీపై నీలినీడలు కమ్ముకున్నాయని చెప్పారు. ఇప్పటికే 2023-24 ఇన్‌పుట్ సబ్సిడీ, వాతావరణ బీమా అందించలేదని, 2024-25లోనూ ఇన్‌పుట్, ఇన్సూరెన్స్ చెల్లించలేదని విమర్శించారు. ప్రస్తుత రబీ సీజన్‌లో పంటలు సాగు చేయడానికి రైతులు సన్నద్ధమవుతున్నా విత్తన పప్పుశనగ అందించకపోవడం దుర్మార్గమన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో పప్పుశనగను 40 శాతం సబ్సిడీతో అందిస్తే కూటమి ప్రభుత్వం వచ్చాక 25 శాతానికే పరిమితం చేశారని మండిపడ్డారు. అది కూడా గత ఏడాది 27 వేల క్వింటాళ్లకు పైగా విత్తన పప్పుశనగ కేటాయిస్తే ఈ ఏడాది 14 వేల క్వింటాళ్లకు కుదించి రైతులకు అన్యాయం చేశారన్నారు. సబ్సిడీ విత్తనాల కోసం రైతులు అధికారుల చుట్టూ తిరుగుతున్న దౌర్భాగ్య పరిస్థితులు తీసుకొచ్చారని మండిపడ్డారు. రైతులు అవస్థలు పడుతున్నా జిల్లాలో ప్రజాప్రతినిధులకు పట్టడంలేదని, లిక్కర్ షాపులు, కాంట్రాక్ట్‌లు చేసుకోవడానికే పరిమితమవుతున్నారని మండిపడ్డారు. ఇప్పటిదాకా కనీసం ఐఏబీ సమావేశం నిర్వహించలేదంటే రైతుల పట్ల ఈ ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వం రెండు, మూడు రోజుల్లో 40 నుంచి 50 శాతం సబ్సిడీతో పప్పుశనగ విత్తనాన్ని రైతుకు ఎంత అవసరం ఉంటే అంత పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. పెట్టుబడి సాయం కూడా అందజేయాలని కోరారు. నెట్‌వర్క్ ఆస్పత్రులకు ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించి వైద్య సేవలు సజావుగా సాగేలా చూడాలన్నారు. ఆరోగ్యశ్రీ అంటే డాక్టర్ వైఎస్ఆర్ పేరు గుర్తుకొస్తుందన్న భయంతో పథకాన్ని చంద్రబాబు నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వెన్నం శివారెడ్డి, కల్చరల్ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు కేశవ రెడ్డి, రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు నాగేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్‌లే దిక్కు!

- వేధిస్తున్న సబ్ రిజిస్ట్రార్ల కొరత



జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

అనంతపురం టౌన్: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సబ్ రిజిస్ట్రార్ల కొరత వేధిస్తోంది. సీనియర్ అసిస్టెంట్లను ఇన్‌చార్జ్‌లుగా నియమించి నెట్టుకొస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 21 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. వీటిల్లో ఆరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సీనియర్ అసిస్టెంట్లతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను కొనసాగిస్తున్నారు. అనంతపురంలోని రామ్‌నగర్ ప్రధాన కార్యాలయంలో ఇద్దరు రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్లు ఉండాల్సి ఉండగా ఒక్కరు సైతం లేకపోవడం గమనార్హం. దీంతో ఇటీవల రూరల్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఇస్మాయిల్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలను అప్పటించారు. రూరల్ కార్యాలయంలో సైతం రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్ రెండు నెలల క్రితం పదవీ విరమణ చేశారు. అక్కడ సైతం ఇన్ చార్జ్‌ను నియమించారు. కళ్యాణదుర్గం, గుత్తి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సీనియర్ అసిస్టెంట్లకు ఇన్‌చార్జ్ బాధ్యతలు ఇచ్చి రిజిస్ట్రేషన్ ప్రక్రియను కొనసాగిస్తున్నారు. శ్రీ సత్యసాయి జిల్లాలో సైతం ఇదే తంతు కొనసాగుతోంది. కదిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇద్దరు రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్లు ఉండాల్సి ఉండగా ఒక్కరే ఉన్నారు. తనకల్లు, చిలమత్తూరు కార్యాలయాలకు రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్లు లేకపోవడంతో అనంతపురం కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ప్రసాద్‌బాబును ఇన్‌చార్జ్‌గా చిలమత్తూరుకు పంపారు. తనకల్లులో అక్కడే పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్‌కు బాధ్యతలు అప్పగించారు.

ప్రజలకు చుక్కలు..

రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్లు లేకపోవడంతో సీనియర్ అసిస్టెంట్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రిజిస్ట్రేషన్ సేవలను వినియోగించుకునేందుకు వచ్చే ప్రజలకు చుక్కలు చూపిస్తున్నారు. చిన్న పనికి సైతం రోజుల తరబడి ప్రదక్షిణ చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్లను నియమించాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయంపై స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ విజయలక్ష్మిని వివరణ కోరగా.. ఆమె స్పందించారు. ఉమ్మడి జిల్లాలో 9 మంది కొత్త సబ్ రిజిస్ట్రార్ల అవసరం ఉందన్నారు. ఇదే విషయాన్ని రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ దృష్టికి తీసుకెళ్లామన్నారు. అక్కడి నుంచి కొత్త ఎస్ఆర్‌లను కేటాయిస్తారన్నారు. ఆర్డర్ రాగానే ఖాళీగా ఉన్న కార్యాలయాలకు రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్లను నియమిస్తామన్నారు.

వైద్య సిబ్బందిపై దాడికి యత్నం

- గుంతకల్లు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఘటన



ఆస్పత్రి వైద్యులతో వాగ్వాదానికి దిగిన రోగి వినోద్, సహాయకులు

గుంతకల్లుటౌన్: వైద్య సిబ్బందిపై ఓ రోగి, అతని సహాయకులు దాడికి యత్నించిన ఘటన గుంతకల్లు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో జరిగింది. గుంతకల్లు టూటౌన్ పోలీసులు తెలిపిన మేరకు.. శనివారం పట్టణంలోని సీఐటీయూ కాలనీ వద్ద ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఇందులో గాయపడిన వినోద్ చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రి క్యాజువాలిటీ విభాగానికి వచ్చాడు. అతనికి సహాయకులుగా ఉషాకిరణ్, సుధా, నారాయణ వచ్చారు. ఈ క్రమంలోనే డాక్టర్ సల్మాన్‌జావెద్ గాయపడిన వినోద్‌ను తాను చూస్తానని, సహాయకులుగా ఉన్న వారు బయటకు వెళ్లాలని సూచించారు. దీంతో కోపోద్రిక్తులైన ఉషాకిరణ్, సుధాలు వైద్యుడిని అసభ్యకరంగా తిట్టారు. చొక్కా పట్టుకుని లాగారు. అడ్డుగా వెళ్లిన నర్సులు రామాంజినమ్మ, హసీనాలను కూడా అసభ్యపదజాలంతో దూషించారు. దీన్నంతటినీ చిత్రీకరిస్తున్న సెక్యూరిటీ గార్డు ప్రవీణ్‌ను అంతు తేలుస్తామంటూ బెదిరించారు. విషయం తెలుసుకున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జయవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో వైద్యులు, నర్సులు, సిబ్బంది మొత్తం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సీఐ మస్తాన్‌కు ఫిర్యాదు చేశారు. డాక్టర్ సల్మాన్ జావెద్ ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా, గాయపడిన వినోద్‌కు వైద్యం చేయకుండా ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించినందుకే తమపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని రోగి సహాయకులు పేర్కొన్నారు.

భయంగా విధులు నిర్వర్తిస్తున్నాం

ప్రజలకు అనునిత్యం వైద్యసేవలందిస్తున్న తమకే రక్షణ లేకుండా పోతోందని ఆస్పత్రి నర్సులు ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యుడిపై దాడిని అడ్డుకున్నందుకు తమను అసభ్యకరంగా దూషించారని కన్నీళ్లు పెట్టుకున్నారు. రాత్రివేళ ఒక్కోసారి మద్యం సేవించి వచ్చే రోగి సహాయకులు బూతులు తిడుతున్నా గత్యంతరం లేక భరిస్తున్నామన్నారు. ఆస్పత్రి వద్ద మూత పడిన పోలీస్ ఔట్‌పోస్టును తెరిపించాలని వేడుకుంటున్నా పట్టించుకోవట్లేదని వాపోయారు.

మోసం చేయడం చంద్రబాబు నైజం



మాట్లాడుతున్న మాజీ మంత్రి శైలజానాథ్



సమావేశానికి హాజరైన వైఎస్సార్ సీపీ నాయకులు

- మాజీ మంత్రి శైలజానాథ్ ధ్వజం

బుక్కరాయసముద్రం: నమ్మించి మోసం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి శైలజానాథ్ పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ మండల అధ్యక్షుడు గువ్వల శ్రీకాంత్‌రెడ్డి అధ్యక్షతన శనివారం బీకేఎస్ మండల పరిధిలోని గాంధీ నగర్, అమ్మవారిపేట, రేకులకుంట గ్రామంలో రచ్చబండ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి శైలజానాథ్, పార్టీ అనంతపురం పార్లమెంట్ పరిశీలకుడు నరేష్‌కుమార్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా శైలజానాథ్ మాట్లాడుతూ చంద్రబాబు తన మామ ఎన్టీఆర్‌ను మోసం చేసి టీడీపీని లాక్కున్నారన్నారు. ప్రజలకు తప్పుడు వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి రావడం, ఆ తర్వాత మోసం చేయడాన్ని రివాజుగా మార్చుకున్నారని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమాన్ని ఏమాత్రమూ పట్టించుకోలేదన్నారు. చంద్రబాబు 30 ఏళ్ల చరిత్రలో చెప్పుకోదగ్గ ఒక్క పథకమూ లేదన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా వైఎస్సార్ సీపీ ప్రత్యేక కార్యాచరణ రూపొందించిందన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి ప్రజా సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. పార్టీ పార్లమెంట్ పరిశీలకుడు నరేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు ప్రభుత్వాన్ని నిలదీస్తూ ఉండాలన్నారు. కార్యకర్తలకు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ పార్లమెంట్ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోకుల్‌రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ముసలన్న, మహిళా రాష్ట్ర కార్యదర్శి లలితా కల్యాణి, జెడ్పీటీసీ సభ్యుడు భాస్కర్, ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిద్దె కుళ్లాయప్ప, సర్పంచ్‌లు పార్వతి, నరసమ్మ, పూల నారాయణస్వామి, చికెన్ నారాయణస్వామి, సాకే నారాయణస్వామి, ఆది, ముత్యాలశీన, నందినే మల్లికార్జున, 6 మండలాల అధ్యక్షులు పూల ప్రసాద్, ఎల్లారెడ్డి, మహేశ్వరెడ్డి, ఖాదర్‌వలి, అనుబంధ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డిమాండ్లు నెరవేర్చే వరకు సమ్మె



రిలే దీక్షల్లో పాల్గొన్న పీహెచ్‌సీ వైద్యులు

అనంతపురం మెడికల్: తమ డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చే వరకు సమ్మె కొనసాగుతుందని పీహెచ్‌సీ వైద్యులు స్పష్టం చేశారు. డిమాండ్ల సాధన కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీ) వైద్యులు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం వద్ద చేపట్టిన రిలే దీక్షలు ఏడో రోజు శనివారం కొనసాగాయి. పీహెచ్‌సీ వైద్యుల అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ తమ న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం తేలిగ్గా తీసుకుందని మండిపడ్డారు. పీజీ మెడికల్ కోర్సుల్లో ఇన్ సర్వీస్ కోటా క్లినికల్ విభాగంలో 20 శాతం బ్రాంచ్‌లో కొనసాగించాలన్నారు. అలాగే చంద్రన్న సంచార చికిత్స కార్యక్రమానికి సంబంధించి అలవెన్స్‌లు ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నోషనల్ ఇంక్రిమెంట్స్ మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వం దిగి వచ్చే వరకు సమ్మెను ఆపేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు డాక్టర్ శివ సాయి, డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని, డాక్టర్ శివ కృష్ణ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో కార్మికుడి మృతి

కుందుర్పి: విద్యుత్ కార్యాలయం వద్ద మరమ్మతులు చేస్తున్న కార్మికుడు ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతంతో మృతి చెందాడు. విద్యుత్ శాఖ, పోలీసు అధికారులు తెలిపిన మేరకు... తాడిపత్రికి చెందిన రమేష్ అనే కాంట్రాక్టర్ కుందుర్పిలో వైఎస్సార్ కడప జిల్లా కొండాపురం గ్రామానికి చెందిన జనార్ధనాచార్యులు (34)తో శనివారం విద్యుత్ కార్యాలయంలో మరమ్మతులు చేయిస్తున్నాడు. ఉన్నట్టుండి విద్యుత్ షాక్‌కు గురవడంతో మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ ఆర్టీటీ ఉద్యోగి మృతి



నాగరాజు (ఫైల్)

రాప్తాడురూరల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న ఎకాలజీ సెంటర్ ఉద్యోగి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... ఎకాలజీ సెంటర్ పరిధిలోని కళ్యాణదుర్గం నియోజకవర్గంలో నాగరాజు (45) ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 7న పంగల్ రోడ్డు వైపు బైకులో వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన ప్రైవేట్ బస్సు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడ్డ నాగరాజును సర్వజనాస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో బెంగళూరుకు తరలించారు. అక్కడి వైద్యులు పరిస్థితి చేజారిందని తేల్చారు. ఈ క్రమంలో తిరిగి అక్కడి నుంచి అనంతపురం సర్వజన ఆస్పత్రికి తరలించగా...చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈయన భార్య సుచరిత బెళుగుప్ప జెడ్పీ హైస్కూలులో గణితం టీచరుగా పని చేస్తున్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. నాగరాజు మృతి బాధాకరమని ఎంపీపీ కమలమ్మ, సర్పంచులు అతావుల్లా, బొమ్మయ్య, ఓబన్న పేర్కొన్నారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి జగన్

- కూటమి ప్రభుత్వంలో దళితులపై పెరిగిన అకృత్యాలు
- మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణతో ఎస్సీ విద్యార్థులకు అన్యాయం
- ఈ అన్యాయాన్ని ప్రతి పౌరునికీ తెలియజేయాల్సిన బాధ్యత మనదే
- లక్ష మంది ఎస్సీ యువకులతో జగనన్న ఫోర్స్
- ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు టీజేఆర్ సుధాకర్ బాబు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సుధాకరబాబు

అనంతపురం : అణగారిన వర్గాల ఆశాజ్యోతి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు టీజేఆర్ సుధాకర్ బాబు పేర్కొన్నారు. అనంతపురంలోని ఆ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మల్లెమీద నరసింహులు అధ్యక్షతన ఎస్సీ సెల్ జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడితో పాటు విశిష్ట అతిథులుగా మాజీ మంత్రి సాకే శైలజానాథ్, ఎస్సీ సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి, అనంతపురం పార్లమెంట్ పరిశీలకులు బోరెడ్డి నరేష్ కుమార్‌రెడ్డి, విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా టీజేఆర్ సుధాకర్ బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో దళిత సామాజిక వర్గాలపై దాడులు, హత్యలు, అత్యాచారాలు అకృత్యాలు ఎక్కువయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎస్సీలకు రూ.77 వేల కోట్లు ఖర్చు పెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఇప్పటిదాకా ఎస్సీలకు నయాపైసా ఖర్చు చేయలేదన్నారు. ఈ ప్రభుత్వ మోసాన్ని అందరికీ తెలియచెప్పాలన్నారు. రాష్ట్రమంతటా లక్ష మంది ఎస్సీ యువకులతో 'జగనన్న దళిత ఫోర్స్' ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రంలో నూతనంగా మంజూరైన 17 మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తే ఎస్సీ కేటగిరీలో 880 సీట్లు కోల్పోయే ప్రమాదముందన్నారు. డాక్టర్ కావాలనే కలను కూటమి ప్రభుత్వం చిదిమేసిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం సలీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ గౌడ్, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెన్నోబులేసు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిద్దె కుళ్లాయప్ప, ఉమ్మడి జిల్లా అబ్జర్వర్ నల్లాని బాబు, రాష్ట్ర అధికారి ప్రతినిధి ఎగ్గల శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అనంతపురం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, నగర మహిళా అధ్యక్షురాలు సాకే చంద్రలేఖ, జిల్లా ప్రధాన కార్యదర్శి శోభ, ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు పసులూరు ఓబులేసు, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి గోవిందప్ప, రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.రాఘవ, గుంతకల్లు అధ్యక్షుడు వీరేష్ బాబు, కళ్యాణదుర్గం అధ్యక్షుడు తిప్పేస్వామి, రాయదుర్గం అధ్యక్షుడు కె.రామాంజినేయులు, ఉరవకొండ అధ్యక్షుడు అక్కులప్ప, కంబదూరు జెడ్పీటీసీ నాగరాజు, శింగనమల ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎం.ఆంజినేయులు, మహిళా విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి కృష్ణవేణి పాల్గొన్నారు.

సమసమాజ స్థాపనే జగన్ లక్ష్యం



అంబేడ్కర్ ఆశయాలు ముందుకు తీసుకెళ్లేది జగన్‌మోహన్‌రెడ్డేనని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అధికారాన్ని అప్పగించడడంతో పాటు సమ సమాజాన్ని స్థాపించడమే ఆయన లక్ష్యమని అన్నారు. ఇందులో భాగంగానే గత మంత్రి వర్గంలో 70 శాతం బడుగు, బలహీన, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అప్పగించారని తెలిపారు.

పేదలను విస్మరించిన బాబు



సీఎం చంద్రబాబు నాయుడు పెత్తందార్లకు దన్నుగా ఉంటూ పేదలను విస్మరించారని అనంతపురం పార్లమెంట్ పరిశీలకులు బోరెడ్డి నరేష్ కుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేద, బడుగు, బలహీన వర్గాల వారికి సంక్షేమ పథకాలతో పాటు ఆర్థిక, సామాజిక న్యాయం కల్పించారని గుర్తు చేశారు.

ప్రైవేటీకరణతో పేదలకు నష్టం



దళితులకు విద్య, వైద్యం అందుబాటులో ఉండాలని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో కార్యక్రమాలు చేపట్టారని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సాకే శైలజానాథ్ అన్నారు. కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తే పేద బిడ్డలు నష్టపోతారన్నారు. ఆర్ఎస్ఎస్ భావజాలం ఎస్సీ వర్గాలకు వ్యతిరేకమన్నారు. ఎస్సీలను ఎదగనీయకుండా చేయడమే వారి లక్ష్యమన్నారు. అలాగే దళితుల సహజ శత్రువు చంద్రబాబు అని స్పష్టం చేశారు. రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లిలో దళిత బిడ్డకు జరిగిన అన్యాయాన్ని ప్రశ్నించడానికి వెళితే ఎన్నో ఆంక్షలు విధించారన్నారు. బాధిత కుటుంబాన్ని కూటమి ప్రజాప్రతినిధులు పరామర్శించిన పాపాన పోలేదని విమర్శించారు.

రాష్ట్రంలో అరాచక రాజ్యం



రాష్ట్రంలో అరాచకం రాజ్యమేలుతోందని ఎస్సీ సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కనకారావు మండిపడ్డారు. ఎస్సీలపై విచక్షణారహితంగా దాడులు చేస్తున్నారన్నారు. ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీలు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా ఎదగాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అందించారన్నారు. కేబినెట్ నుంచి గ్రామస్థాయి వరకు అవకాశాలు కల్పించారని తెలిపారు. దళితుల ఆత్మగౌరవ ప్రతీకగా అమరావతిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతి వనాన్ని ఏర్పాటు చేశారన్నారు. చంద్రబాబు నాయుడు దళితుల సంక్షేమానికి తీసుకున్న చర్యలు శూన్యమని ధ్వజమెత్తారు.



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

దళితులపై దౌర్జన్యాలను తిప్పికొట్టాలి



దళితులపై జరుగుతున్న దాడులను తిప్పికొట్టాలని ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెన్నోబులేసు, రాష్ట్ర జనరల్ సెక్రెటరీ మిద్దె కుళ్లాయప్ప పిలుపునిచ్చారు.నార్పల మండలంలో ఎస్సీ యువకుడు, వికలాంగుడు అయిన చిన్న కుళ్లాయప్పను నిర్దాక్షిణ్యంగా అరెస్ట్ చేయించి మడకశిరకు తీసుకెళ్లి థర్డ్ డిగ్రీ ప్రయోగించి ఇబ్బందులకు గురి చేయించారని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజుపై మండిపడ్డారు. కుప్పంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేస్తే ఎంఎస్ రాజు ఎందుకు ప్రశ్నించలేదన్నారు. రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లిలో జరిగిన ఘటనకు సంబంధించి ఏనాడైనా స్పందించారా అని నిలదీశారు. దళిత బిడ్డల మానప్రాణాలు పోతున్నా.. పట్టించుకోకుండా.. చంద్రబాబు తొత్తుగా మారారని విమర్శించారు.

గురుకులాల సమస్యలపై అలసత్వం



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి

అనంతపురం సిటీ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తోందని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎన్.రమణారెడ్డి ధ్వజమెత్తారు. అనంతపురంలోని ఉపాధ్యాయ భవన్‌లో ఎస్టీయూ అనుబంధం సాంఘిక సంక్షేమ గురుకుల విభాగం రాష్ట్ర స్థాయి ప్రతినిధి లక్ష్మీనారాయణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై రమణారెడ్డి మాట్లాడారు. గురుకులాల్లో పాత టైం టేబుల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పీజీటీ హిందీ పోస్టును పునరుద్ధరించాలని గురుకుల విభాగం రాష్ట్ర ప్రతినిధి లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. గురుకులాల్లోని క్వార్టర్స్‌కు ఏడాదిన్నర కాలంగా పూర్తి హెచ్ఆర్ఏ పేరుతో రూ.8 వేల నుంచి రూ.15 వేల వరకు ముక్కుపిండి వసూలు చేస్తున్నారని రాష్ట్ర కో కన్వీనర్ రామానాయుడు ధ్వజమెత్తారు. అయితే క్వార్టర్స్ శిథిలావస్థకు చేరినా పట్టించుకోకపోవడం దారుణమని మండిపడ్డారు. గురుకులాల్లో డీఎస్సీ ద్వారా పోస్టు కోల్పోయిన పార్ట్ టైం టీచర్లకు మిగిలిన ఖాళీల్లో అవకాశం కల్పించాలని మరో ప్రతినిధి ఫకృద్దీన్ కోరారు. అదనపు ప్రధాన కార్యదర్శి సూర్యుడు, అసోసియేట్ అధ్యక్షుడు నారాయణస్వామి, తిరుపతయ్య మాట్లాడారు. జిల్లా కార్యదర్శి మల్లికార్జున, అరుణ్ కుమార్, చిన్నన్న, హనుమంతు, వన్నూరుస్వామి తదితరులు పాల్గొన్నారు.

మందలించారని యువకుడి ఆత్మహత్య



కులవర్ధన్ (ఫైల్)

రాప్తాడు: ఇంట్లో మందలించారని మనస్తాపం చెంది ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ధర్మవరం రైల్వే పోలీసులు, మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.... అనంతపురం రూరల్ మండలం ఆకుతోటపల్లికి చెందిన రాము, లక్ష్మీదేవి దంపతులు. పదేళ్ల క్రితం రాము మృతి చెందాడు. అప్పటి నుంచి కుమారుడు కులవర్ధన్ (21) వ్యవసాయ పనులతో పాటు తల్లితో కలిసి పాడి ఆవులు పెట్టుకుని కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఇదిలా ఉండగా ఏడాది కిత్రం అప్పు చేసి రూ.లక్ష విలువైన బైక్ కొనుగోలు చేశాడు. వీటిని తీర్చలేక, పనులకు వెళ్లకపోవడంతో ఇంట్లో మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన కులవర్ధన్ శనివారం గంగులకుంట గ్రామ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే కీమెన్ సమాచారంతో ధర్మవరం రైల్వే పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, మృతుని వద్ద దొరికిన సెల్ ఫోన్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుతాసుపత్రికి తరలించారు.

భర్త, కుమారుడి ఆచూకీ తెలపండి



బాధితురాలు లక్ష్మీదేవి

యాడికి: 'యాడికి పోలీసులు న్యాయం చేయలేదు. నా భర్త, కుమారుడి ఆచూకీ తెలిపి మీరైనా న్యాయం చేయండి' అంటూ తాడిపత్రి ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి వద్ద లక్ష్మీదేవి అనే మహిళ శనివారం మొరపెట్టుకుంది. వివరాలు.. ఈ నెల 8వ తేదీన యాడికి మండలం వెంగన్నపల్లికి చెందిన లక్ష్మీదేవి పట్ల అదే గ్రామానికి చెందిన విశ్వనాథ అనే వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించాడు. విషయాన్ని లక్ష్మీదేవి తన భర్త నారాయణ స్వామి, పెద్ద కుమారుడు నవీన్‌కు చెప్పింది. వారు విశ్వనాథ ఇంటికి వెళ్లి నిలదీయడంతో గొడవ జరిగింది. అనంతరం విశ్వనాథ తన నలుగురు సోదరులతో కలిసి లక్ష్మీదేవి ఇంటిపై దాడి చేశారు. దీనిపై ఫిర్యాదు చేయడానికి లక్ష్మీదేవి, నారాయణ స్వామి, నవీన్ బయలు దేరుతుండగా ఇద్దరు పోలీసులు వచ్చి అడ్డుకున్నారు. అనంతరం అదేరోజు సుమారు 10 మంది పోలీసులు వచ్చి ముగ్గురినీ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. లక్ష్మీదేవిని అర్ధరాత్రి ఇంటికి పంపారు. గొడవ జరిగిన నేపథ్యంలో ఆమె తన సొంతూరికి వెళ్లకుండా తన బంధువులైన వీరన్నపల్లికి చేరుకుంది. పోలీసులు నారాయణ స్వామి, నవీన్‌ను మూడు రోజులైనా ఇంటికి పంపలేదు. పైగా నారాయణ స్వామి, లక్ష్మీదేవి, నవీన్‌తో పాటు మరి కొంతమందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. లక్ష్మీదేవి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. లక్ష్మీదేవిని కూడా మూడు రోజుల పాటు పోలీస్‌స్టేషన్ చుట్టూ తిప్పారు. ఈ క్రమంలో శనివారం తాడిపత్రి ఏఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి యాడికి పోలీసుస్టేషన్‌కు లక్ష్మీదేవిని పిలిపించి జరిగిన సంఘటనపై విచారణ చేశారు. తనకు, తన కుటుంబానికి జరిగిన అన్యాయాన్ని, పోలీసుల తీరును ఏఎస్పీకి లక్ష్మీదేవి వివరించి న్యాయం చేయాలని వేడుకుంది. ఘటనపై సమగ్ర విచారణ చేస్తామని లక్ష్మీదేవికి ఏఎస్పీ భరోసా ఇచ్చారు.

టూల్-2తో సమన్వయం చేయాలి

అనంతపురం సిటీ: మూడు, నాలుగు, ఐదో తరగతి విద్యార్థుల కోసం మూల్యాంకనాన్ని ఫార్మేటివ్ అసెస్‌మెంట్ (ఎఫ్ఏ) టూల్-2తో సమన్వయం చేయాల్సిందిగా జిల్లా సాధారణ పరీక్ష మండలి, జిల్లా సెక్రటరీ గంధం శ్రీనివాసులు శనివారం తెలిపారు. ఈ మేరకు మార్గదర్శకాలు విడుదల చేసినట్లు వివరించారు. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను రూపొందించి అన్ని యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పంపినట్లు తెలిపారు.

యువతులు అన్ని రంగాల్లోనూ రాణించాలి

- ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి పిలుపు



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

అనంతపురం కల్చరల్: యువతులు అన్ని రంగాల్లోనూ రాణించాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి పిలుపునిచ్చారు. ఐద్వా (అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం) రాష్ట్ర మహాసభల సందర్భంగా మూడురోజుల పాటు సాగిన సాంస్కృతికోత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. అనంతపురంలోని ఆర్ట్స్ కాలేజ్ డ్రామా హాలు వేదికగా సాగిన వేడుకలకు ఐద్వా రాష్ట్ర నేతలు రమాదేవి, సావిత్రి, డాక్టర్ ప్రసూన, డాక్టర్ జగర్లపూడి శ్యామసుందరశాస్త్రి, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు రియాజుద్దీన్, వన్నూర్ మాస్టర్ తదితరులు ఆత్మీయ అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం కూడా కలిసి రావడంతో వారు చిన్నారులకు బోధనా పద్ధతుల్లో మహిళల శక్తిని, సాధికారతను వివరించిన తీరు ప్రశంసలందుకుంది.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ముగింపు ఉత్సవాలలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ముఖ్యంగా అశోక్‌మాస్టర్ , విజయ్ మాస్టర్ శిష్య బృందాలతో కలిసి పల్లెటూరు మా పల్లెటూరు, ఘల్లు ఘల్లు జోడెద్దులబండిరా నృత్యాలు, వరకట్నం లఘునాటికను నిశిత , ఆరాధ్యా బృందాల అద్భుతంగా ప్రదర్శించి మెప్పించారు. అలాగే ప్రజానాట్యమండలి కళాకారుల ఉద్దీపన గీతాలతో ఆడిటోరియాన్ని హోరెత్తించారు. అనంతరం మూడురోజులుగా ప్రేక్షకులను అలంరింపజేసిన మాస్టర్లకు, చిన్నారులకు జ్ఞాపికలందించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శ్యామల, చంద్రిక, అశ్విని, రామాంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తూ కానిస్టేబుల్ మృతి



సతీష్‌కుమార్ (ఫైల్)

రాప్తాడురూరల్: ప్రమాదవశాత్తూ కానిస్టేబుల్ మృతి చెందిన ఘటన శనివారం తెల్లవారుజామున అనంతపురం రూరల్ మండలం బసవతారకనగర్‌లో చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు.. బసవతారకనగర్‌లో నివాసం ఉంటున్న సతీష్ కుమార్ (38) అనంతపురం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో పాలు తెచ్చేందుకని బైక్‌పై వెళ్తుండగా కుక్క అడ్డురావడంతో అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడ్డ సతీష్‌కుమార్‌ను తొలుత ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స ప్రారంభించేలోపే మృత్యువాతపడ్డాడు. వివాదారహితుడిగా సతీష్‌కుమార్ మంచి గుర్తింపు ఉంది. అకాలమృతిని సన్నిహితులు, డిపార్ట్‌మెంట్ ఉద్యోగులు జీర్ణించుకోలేకపోయారు. మృతుడికి భార్య మంజుతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శేఖర్ తెలిపారు.

గార్లదిన్నె: అనంతపురం ట్రాఫిక్ కానిస్టేబుల్ సతీష్‌కుమార్ (38) అంత్యక్రియలు శనివారం గార్లదిన్నె మండలం పాత కల్లూరులో పోలీసు లాంఛనాలతో నిర్వహించినట్లు శింగనమల సీఐ కౌలుట్లయ్య తెలిపారు. సతీష్‌కుమార్ 2011 నుంచి పోలీసు శాఖలో పనిచేస్తున్నారన్నారు.

ప్రేమ విఫలమై యువకుడి బలవన్మరణం

తాడిపత్రి రూరల్: ప్రేమలో విఫలమైన యువకుడు అర్ధంతరంగా తనువు చాలించాడు. తల్లిదండ్రులకు గుండెకోత మిగిల్చాడు. జీఆర్‌పీఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ వరప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెద్దపొలమడ గ్రామానికి చెందిన సోమశేఖర్ (29) తల్లిదండ్రులు క్రిష్ణవేణి, మునయ్యతో కలిసి చేనేత మగ్గం నేసేవాడు. కొంత కాలం క్రితం సోమశేఖర్ ఓ యువతిని ఇష్టపడ్డాడు. తన ప్రేమ ప్రతిపాదనకు యువతి ఒప్పుకుంటే వివరాలు చెబుతానని తల్లిదండ్రుల వద్ద చెప్పాడు. ఈ క్రమంలో తన ప్రేమను వ్యక్తపరచిన సోమశేఖర్‌కు యువతి నుంచి తిరస్కరణ ఎదురైంది. ఇక అప్పటి నుంచి మూడీగా ఉండేవాడు. ఏమైందని తల్లిదండ్రులు ఆరా తీస్తే.. ఆమె లేనిదే తనకు జీవితం లేదని చెప్పాడు. రోజూ బాధతో కుంగిపోతున్న కుమారుడిని ఓదార్చేందుకు ప్రయత్నించారు. అయినా సోమశేఖర్ జీవితంపై విరక్తి చెంది శుక్రవారం రాత్రి మండలంలోని కోమలి రైల్వే స్టేషన్ వద్ద రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. లోకో పైలట్ సమాచారం మేరకు జీఆర్‌పీఎఫ్ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి జేబులో ఉన్న ఆధార్ కార్డులోని వివరాల మేరకు తల్లిదండ్రులకు సమాచారం అందించారు.

కెంచానపల్లిలో ఇరువర్గాల ఘర్షణ



గాయపడ్డ చిక్కమ్మ, సతీష్

రాయదుర్గం: కెంచానపల్లిలో శనివారం రాత్రి ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఎనిమిది మంది గాయపడ్డారు. బాధితులు తెలిపిన మేరకు.. గ్రామంలోని ఓ వర్గం వారు ఆవులదేవర నిర్వహిస్తున్న సమయంలో మరో వర్గం వారు చిన్న విషయానికి గొడవ పడ్డారు. ఇది కాస్తా ఉద్రిక్తతకు దారితీసింది. ఈ ఘర్షణలో వైఎస్సార్‌సీపీ వర్గీయులు వీరేష్, చిక్కమ్మ, సతీష్, గోవిందు, రమేష్‌పై టీడీపీ వర్గీయులు దాడి చేశారు. తీవ్రంగా గాయపడ్డ వారిని బంధువుల సహకారంతో ఆస్పత్రిలో చేర్చారు. ఇదిలా ఉండగా టీడీపీకి చెందిన మురళి, మంజునాథ, భరత్ కూడా ఆస్పత్రిలో చేరారు. విషయం తెలియగానే అర్బన్ సీఐ జయనాయక్ సిబ్బందితో కలసి గ్రామాన్ని సందర్శించి పరిస్థితిని సద్దుమణిగించారు. పరిస్థితి అదుపులోకి వచ్చే వరకు గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం విచారణ జరిపి ఇరువురిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

పాపం జయరంగారెడ్డి..

- రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స కోసం అవస్థలు
- ఎన్టీఆర్ వైద్య సేవలు నిలిపివేయడంతో సకాలంలో అందని వైద్యం



రోడ్డు ప్రమాదంలో గాయపడిన జయరంగారెడ్డి

పుట్లూరు: నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఎన్టీఆర్ వైద్య సేవలు నిలిచిపోవడంతో సకాలంలో వైద్యం అందక పేదలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నెల పదో తేదీన ఉపాధి హామీ పనుల కోసం వెళుతున్న సమయంలో తూఫాన్ వాహనం ఢీకొనడంతో గోపురాజుపల్లికి చెందిన జయరంగారెడ్డి, వసంత గాయపడ్డారు. వీరిలో జయరంగారెడ్డి పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. కూలి పనులకు వెళ్లి జీవనం సాగించే జయరంగారెడ్డి కుంటుంబంలో ఇప్పటికే భార్య కంటి ఆపరేషన్ చేయించుకోగా, కుమారుడు రాజారెడ్డి నెల రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స తీసుకుంటున్నాడు. ఇలాంటి సమయంలో అండగా ఉన్న జయరంగారెడ్డి రోడ్డు ప్రమాదంలో కాలు విరగడంతో ఆ కుటుంబంలో అంధకారం నెలకొంది. ఇదే సమయంలో ఎన్టీఆర్ వైద్య సేవలను ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పలు నిలిపివేయడంతో సకాలంలో మెరుగైన వైద్యం అందలేదు. గాయపడిన జయరంగారెడ్డిని అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే కాలు విరగడంతో పాటు నరాలు తెగిపడటం వల్ల సర్జరీ చేయడానికి న్యూరో సర్జన్ అందుబాటులో లేరనే కారణంతో చికిత్స ఆలస్యమౌతోంది. రోజులు గడిస్తే కాలు తొలగించాలని వైద్యులు చెబుతుండటంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ప్రైవేటుగా వైద్యం చేయించేందుకు ఆపన్నహస్తం కోసం అర్థిస్తున్నారు. ప్రత్యేక సహాయ నిధితో జయరంగారెడ్డిని ఆదుకోవాలని గోపురాజుపల్లి గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

బుక్కరాయసముద్రం: గోవిందపల్లి సమీపంలోని 544 జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తాడిపత్రికి చెందిన దాదాపీర్ (35) అనంతపురం నుంచి తాడిపత్రికి లారీలో బయల్దేరాడు. గోవిందపల్లి సమీపంలో ఎర్రవంక బ్రిడ్జిని లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవింగ్ సీటులోంచి దాదాపీర్ అద్దంలోంచి ఎగిరి వంకలోకి పడిపోయాడు. తలకు తీవ్రమైన గాయాలు కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. ఇదే ప్రమాదంలో క్లీనర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

13న జెడ్పీలో సదస్సు

అనంతపురం టవర్‌క్లాక్: ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఏఐఎల్‌యూ) ఆధ్వర్యంలో 'న్యాయవ్యవస్థ- ఎదుర్కొంటున్న సవాళ్లు' అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏఐఎల్‌యూ జిల్లా అధ్యక్షుడు ఈరమాసప్ప శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటలకు నిర్వహిస్తున్న సదస్సుకు ముఖ్య అతిథులుగా ప్రముఖ న్యాయవాది తీస్తా సెతల్వాద్ హాజరవుతారన్నారు. ఏఐఎల్‌యూ సభ్యులు హాజరు కావాలని కోరారు.

పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: కాశీ విశ్వేశ్వరాలయంలో కార్తీక మాసోత్సవాలను ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లను చేస్తున్నామని ఆలయ ఈఓ నాగేంద్రుడు, ధర్మకర్తల మండలి చైర్మన్ నరేంద్ర చౌదరి అన్నారు. శనివారం స్థానిక మొదటి రోడ్డు శివాలయంలో ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 22 నుంచి వచ్చే నెల 20 వరకు పరమేశ్వరునికి ప్రీతిపాత్రమైన నాలుగు సోమవారాలు, 5న వచ్చే కార్తీక శుద్ధ పౌర్ణమి రోజుల్లో విశేషంగా ఏకవార రుద్రాభిషేకాలు, అన్నాభిషేకాలు జరుగుతాయన్నారు. రెండో సోమవారం శివపార్వతుల కల్యాణోత్సవం ఉంటుందన్నారు. లక్ష దీపార్చన, జ్వాలా తోరణం, బిల్వార్చన వంటి కార్తీక దీపోత్సవాలకు తరలివచ్చే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. సోమవారాల్లో కేదారేశ్వర వ్రతాలు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు శాస్త్రోక్తంగా జరుగుతాయని, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విరబూసిన నవ్వులు



హాస్యభారతి పురస్కారమందుకున్న సుధాకరమూర్తి

అనంతపురం కల్చరల్: ఒత్తిడి నిండిన సమాజానికి నవ్వు అనేది దివ్య ఔషధమని వక్తలన్నారు. శనివారం స్థానిక వివేకానంద యోగ భవన్ వేదికగా జరిగిన హాస్యభారతి కార్యక్రమం ఆద్యంతం నవ్వులు పూయించింది. యోగకేంద్రం అధ్యక్షుడు ఎం.రాజశేఖరరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మానవతాకో కన్వీనర్ సలీం మాలిక్, కేవీ రమణ, సీనియర్ న్యాయవాది నామసేవ హరికృష్ణ, తెలుగు భాషా వికాస ఉద్యమ నాయకులు డాక్టర్ జగర్లపూడి శ్యామసుందర శాస్త్రి, యోగ కేంద్రం ప్రతినిధి దివాకర్, రచయితలు జీఎల్ఎన్ ప్రసాద్, శంకరప్రసాద్ తదితరులు మాట్లాడారు. మానసిక ఆనందాన్నందించే హాస్యభారతి వంటి కార్యక్రమాలు తరచుగా జరగాలని వక్తలన్నారు. రియాజుద్దీన్, మిద్దె మురళీకృష్ణ, సుధాకరరెడ్డి, ప్రసాద్, హరి తదితరులు హాస్యప్రియులను కడుపుబ్బా నవ్వించారు. ఈ సందర్భంగా దశాబ్దాలుగా అందరినీ నవ్విస్తున్న సుధాకరమూర్తిని హాస్యభారతి పురస్కారంతో సత్కరించారు.

సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తే సహించం



బైక్‌లపై బయలుదేరిన ఏఐఎస్ఎఫ్ కార్యకర్తలు

అనంతపురం సిటీ: ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శనివారం పలు విద్యా సంస్థలను కార్యకర్తలు ముట్టడించారు. సెలవు రోజుల్లో తరగతులు నిర్వహించకుండా అడ్డుకున్నారు. విద్యార్థులను బయటకు పంపి నిరసన తెలిపారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి హనుమంతరాయుడు, కుళ్లాయిస్వామి, నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మంజునాథ్, ఉమా మహేశ్ నాయకత్వంలో కార్యకర్తలు బైకులపై వెళ్లి తరగతులను బహిష్కరించారు. సెలవు రోజుల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

బుక్కరాయసముద్రం: గోవిందపల్లి సమీపంలోని 544 జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తాడిపత్రికి చెందిన దాదాపీర్ (35) అనంతపురం నుంచి తాడిపత్రికి లారీలో బయల్దేరాడు. గోవిందపల్లి సమీపంలో ఎర్రవంక బ్రిడ్జిని లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవింగ్ సీటులోంచి దాదాపీర్ అద్దంలోంచి ఎగిరి వంకలోకి పడిపోయాడు. తలకు తీవ్రమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఇదే ప్రమాదంలో క్లీనర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శిశు గృహ కేసులపై అదే నిర్లక్ష్యం

- సర్వజనాస్పత్రిలో వైద్యుల అలసత్వం



చిన్నపిల్లల వార్డులో ఒకే మంచంపై ముగ్గురు ఉన్న పసికందులు, తల్లులు (మధ్యలో అద్వితను ఎత్తుకున్న ఆయా)

అనంతపురం మెడికల్: ఇటీవల అనంతపురం శిశు గృహలో పసికందు మృతి రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. అయినా, పసికందులు, చిన్నారుల ఆరోగ్యం పట్ల అటు వైద్యులు, ఇటు శిశు గృహ అధికారులు అదే నిర్లక్ష్యం చూపుతున్నట్లు తెలుస్తోంది. సర్వజనాస్పత్రిలోని వైద్యుల్లో ఎటువంటి మార్పు లేకుండా పోయింది. సాక్షాత్తు కలెక్టర్ ఆనంద్ శిశు గృహ నుంచి వచ్చే కేసులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించినా.. పెడచెవిన పెట్టడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల శిశు గృహ నుంచి వచ్చిన 8 నెలల అద్విత అనే చిన్నారిని అప్పటికే ఒకే మంచంపై ఉన్న ఇద్దరు చిన్నారుల మధ్య ఉంచారు. ఓ వైపు ఇరుకుగా ఉంటూ తల్లులు, పిల్లలు ఇబ్బందులు పడుతున్న మంచంపైనే బిడ్డను ఉంచడం గమనార్హం. ఒకే మంచంపై ఇద్దరు, ముగ్గురిని ఉంచితే క్రాస్ ఇన్‌ఫెక్షన్స్ వచ్చి బిడ్డ కోలుకునేందుకు ఇబ్బందిగా ఉంటుంది. ఇటీవల సాయినగర్‌లో పసికందు లభ్యమైంది. రెండు వారాల క్రితం ఏవిధంగా ఉందో ఇప్పటికీ ఆ పసికందు బరువులో ఎటువంటి మార్పు లేదు. అడ్మిషన్‌లో ఉంచి పసికందు ఆరోగ్యం మెరుగుపరచాల్సి ఉన్నా... ఎస్ఎన్‌సీయూలో వైద్యులు, స్టాఫ్‌నర్సుల నిర్లక్ష్యంతోనే బిడ్డ ఎదుగుదల లేకుండా పోయిందని ఆస్పత్రి అధికారులంటున్నారు.

విద్యార్థులకు 'మరుగు' సమస్య



అసంపూర్తిగా ఆగిపోయిన మరుగుదొడ్డి నిర్మాణం

ఆత్మకూరు: మండలంలోని తలుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్లు లేక విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో ఉన్న ఒక్క మరుగుదొడ్డి కూడా ఉపయోగించే వీలు లేకపోవడంతో విద్యార్థులు పొలం బాట పడుతున్నారు. ఈక్రమంలో బాలికలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 'నాడు-నేడు' కింద పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టారు. అయితే 80 శాతం పనులు పూర్తయ్యాక ప్రభుత్వం మారింది. ఆ తర్వాత పనులు నిలిచిపోయాయి. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరారు.

రక్తదానం మరొకరికి పునర్జన్మనిస్తుంది



రక్తదానం చేస్తున్న సిబ్బంది

బుక్కరాయసముద్రం: ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేస్తే.. వారికి పునర్జన్మను ఇస్తుందని మానవత రక్తదాతల సంస్థ వ్యవస్థాపకుడు తరిమెల అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్, మానవత రక్తదాతల సంస్థ, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సంయుక్తంగా బ్లడ్ గ్రూపింగ్, రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతన్నారు. అనంతరం కళాశాలలో 850 మంది విద్యార్థులు రక్త నిర్ధారణ పరీక్షలు చేయించుకున్నారు. అలాగే 140 యూనిట్ల రక్తాన్ని ప్రభుత్వ సిబ్బందికి అందజేశారు.. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రంజిత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత చిన్న పుల్లయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు సూచనలిస్తే అధిక దిగుబడులు



మాట్లాడుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

బుక్కరాయసముద్రం: శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు రైతులకు ఎప్పటికప్పుడు పంటల సాగులో మేలైన సూచనలు, సలహాలు అందిస్తే అధిక దిగుబడులు సాధిస్తారని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ సూచించారు. శనివారం మండలంలోని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రధానమంత్రి ధన ధ్యాన కృషి యోజన పోగ్రాం ప్రత్యక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఢిల్లీలో ప్రధాని నరేంద్రమోదీ రూ.42 కోట్లతో వ్యవసాయ ప్రాజెక్టులను ప్రారంభించడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో రేకులకుంట పరిశోధనా స్థానం అధిపతి డాక్టర్ విజయశంకర్‌బాబు, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వసుంధర పశు పరిశోధనా కేంద్రం ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్రారెడ్డి, కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ మధవి, గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి, సస్య ఉత్పత్తి శాస్త్రవేత్త డాక్టర్ శశికళ, సస్య రక్షణ శాస్త్రవేత్త డాక్టర్ కిషోర్ కుమార్‌రెడ్డి, వెటర్నీ శాస్త్రవేత్త డాక్టర్ మాధవి, వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ చందన, కేవీకే సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

అనంతపురం సెంట్రల్: నగరంలో ఆర్టీసీ బస్టాండ్‌లో భవాని అనే మహిళ అదృశ్యమైనట్లు ఆమె భర్త వెంకటేష్ త్రీటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కూడేరు మండలం చోళసముద్రం గ్రామానికి చెందిన వెంకటేష్ తన భార్యతో కలిసి కొత్త బట్టలు కొనుగోలు చేసేందుకు నగరానికి వచ్చారు. తిరిగి స్వగ్రామానికి వెళ్లేందుకు ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకున్నామని, వాటర్ బాటిల్ తెచ్చేందుకు వెళ్లగా తిరిగి వచ్చే సరికి కనిపించలేదని ఫిర్యాదు చేశారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శాంతిలాల్ తెలిపారు.

దివ్యాంగుల సంక్షేమమే ధ్యేయం



మాట్లాడుతున్న సమగ్రశిక్ష ఏపీడీ శైలజా

రాప్తాడు: దివ్యాంగుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని సమగ్ర శిక్ష ఏపీడీ శైలజ అన్నారు. శనివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో సమగ్రశిక్ష ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉచిత ఉపకరణాల ఎంపిక శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో రాప్తాడు, అనంతపురం రూరల్, ఆత్మకూరు మండలాల పరిధిలోని 480 మంది ప్రత్యేత అవసరతలు గల పిల్లలు హాజరయ్యారు. వారిలో 208 మంది పిల్లలను ఉచిత పరికరాల కోసం గుర్తించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే పరిటాల సునీత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమగ్ర శిక్ష ఏపీడీ శైలజ మాట్లాడుతూ.. విభిన్న ప్రతిభావంతులను ప్రతి ఒక్కరూ ప్రేమగా చూసుకోవాలన్నారు. ప్రత్యేక అవసరాలు కల్గిన వారి అర్హత పత్రాలు పరిశీలించి వారికి ఉపయోగపడే పరికరాలను ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో జీసీడీఓ కవిత, ఎంఈఓ మల్లికార్జున, ఐఈఆర్పీలు వెంకట్ నాయుడు, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో వంచన

రాప్తాడురూరల్: ప్రేమ పేరుతో దగ్గరై పెళ్లికి ముఖం చాటేసిన యువకుడిపై అత్యాచారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు అనంతపురం రూరల్ మండలానికి చెందిన ఓ యువతి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తోంది. ఈమెకు ఆరు నెలల కిందట వరుణ్‌తేజ్ అనే లా విద్యార్థితో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. పెళ్లి చేసుకుంటానని చెప్పిన వరుణ్‌తేజ్.. శారీరకంగా దగ్గరయ్యాడు. తర్వాత పెళ్లి గురించి ప్రస్తావన తెస్తే మాట మార్చాడు. ఎన్నిసార్లు బతిమాలినా నిరాకరించడంతో తను మోసపోయానని యువతి గ్రహించింది. తనను నమ్మించి అత్యాచారం చేశాడని బాధితురాలు శనివారం అనంతపురం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు.. నిందితుడు వరుణ్‌తేజ్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

బాలికలకు శాస్త్రీయ అవగాహన అవసరం

- జేవీవీ రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ ప్రసూన



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ ప్రసూన తదితరులు

రాప్తాడురూరల్: బాలికలకు శాస్త్రీయ అవగాహన అవసరమని జన విజ్ఞాన వేదిక (జేవీవీ) రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ పి.ప్రసూన పేర్కొన్నారు. జేవీవీ మహిళా విభాగం సమత ఆధ్వర్యంలో అనంతపురం రూరల్ మండలం కురుగుంట బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో శనివారం 'ఎదిగే ఆడపిల్ల ఏమి తెలుసుకోవాలి' అనే అంశంపై సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రసూన మాట్లాడుతూ బాలికలు చిన్న వయసు నుంచే తమపై తాము అవగాహన పెంచుకోవడంతోనే అపోహలు తొలిగి పరిపక్వత సాధ్యమవుతుందన్నారు. ఒక కుటుంబం ఎదుగుదల శాస్త్రీయ అవగాహన కల్గిన బాలికలపైనే ఆధారపడి ఉంటుందన్నారు. సదస్సు అనంతరం 'ఎదిగే ఆడపిల్ల ఏమి తెలుసుకోవాలి' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ నాగజ్యోతి, సమత జిల్లా కన్వీనర్ రాధా, ప్రిన్సిపాల్ సునీత, సమతా నాయకులు నాగరత్న, లక్ష్మీ, జేవీవీ నాయకులు తిరుపాలు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గాండ్ల కార్పొరేషన్ కమిటీని ఏర్పాటు చేయాలి

అనంతపురం రూరల్: రాష్ట్రంలో వివిధ సామాజిక వర్గాల వారికి కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన విధంగానే గాండ్ల, తెలికలకు కార్పొరేషన్ కమిటీని ఏర్పాటు చేయాలని అఖిల గాండ్ల, తెలిక ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాకాటి హరికృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం విజయనగర లా కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న హరికృష్ణ మాట్లాడుతూ గాండ్ల, తెలికలు ఐక్యంగా ఉంటేనే రాజకీయంగా, ఆర్థికంగా ఎదగవచ్చన్నారు. అన్ని వర్గాల వారికి కార్పొరేషన్ కమిటీలను ఏర్పాటు చేసిన విధంగానే తమ కులానికి సైతం కార్పొరేషన్ కమిటీని ఏర్పాటు చేయడంతో పాటు వృత్తి పరమైన ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ఇటీవల కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన 35 మంది గాండ్ల కులస్తులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మల్లికార్జున, నాగరాజు, బసవరాజు, విజయలక్ష్మి, కేపీ కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కనులవిందుగా పల్లకీ సేవ



స్వామి వారి పల్లకీని ఊరేగిస్తున్న దృశ్యం

ఉరవకొండ రూరల్: మండలం పరిధిలో ప్రసిద్ధి చెందిన పెన్నహోబిలం లక్ష్మి నరసింహస్వామి పల్లకీ సేవ శనివారం కనులవిందుగా సాగింది. ఉదయం స్వామి వారి మూలవిరాట్‌కు అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, పూజల నిర్వహణ అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీ నరసింహస్వామి ఉత్సవమూర్తులను శోభాయమానంగా వివిధ పుష్పాలతో అలంకరించిన పల్లకీలో కొలువుదీర్చి ఆలయ ప్రాంగణం చుట్టూ డప్పు వాయిద్యాలు, మేలతాళాల నడుమ ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో అర్చకులు ద్వారకా తిరుమల స్వామి, బాలాజీ స్వామి, ఆలయ సిబ్బంది మారుతి, తదితరులు పాల్గొన్నారు.

రేపు 'జుగల్బందీ' పుస్తకావిష్కరణ

అనంతపురం కల్చరల్: ప్రముఖ కవి, విమర్శకుడు నందవరం కేశవరెడ్డి రచించిన 'జుగల్బందీ' పుస్తకావిష్కరణను అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు సంఘం కార్యదర్శి తన్నీరు నాగేంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10.30 గంటలకు స్థానిక ఎన్జీఓ హోమ్ వేదికగా సాగే కార్యక్రమంలో ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, డాక్టర్ శాంతినారాయణ పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని, సాహితీ అభిమానులు విచ్చేయాలని కోరారు.

పండిత్ పరిషత్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎర్రిస్వామి

అనంతపురం సిటీ: పండిత్ పరిషత్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సి.ఎర్రిస్వామి ఎన్నికయ్యారు. గుంటూరులో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో తనను ఎన్నుకున్నట్లు ఎర్రిస్వామి శనివారం తెలిపారు. భవిష్యత్‌లో పండితుల సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం సాగిస్తానని ఆయన ప్రకటించారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన ఎర్రిస్వామికి జిల్లా అధ్యక్షుడు హనుమేశ్, ప్రధాన కార్యదర్శి తులసిరెడ్డి, కార్యవర్గ సభ్యులు అభినందనలు తెలిపారు.



బాలికల కోలాట ప్రదర్శన

ఉల్లాసంగా.. ఉత్సాహంగా



ఐద్వా (అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం) రాష్ట్ర మహాసభల సందర్భంగా మూడురోజుల పాటు సాగిన సాంస్కృతికోత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. చివరిరోజు అనంతపురంలోని ఆర్ట్స్ కాలేజ్ డ్రామా హాలు వేదికగా వేడుకలు ఉల్లాసంగా, ఉత్సాహంగా సాగాయి. డ్యాన్సులతో చిన్నారులు ఆకట్టుకున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



సంప్రదాయ వస్త్రధారణలో చిన్నారుల నృత్యప్రదర్శన

ముగ్గురిపై అట్రాసిటీ కేసు..

గుత్తి: ముగ్గురిపై అట్రాసిటీ కేసు నమోదు చేశామని ఎస్ఐ సురేష్ తెలిపారు. ఓల్డ్ సీపీఐ కాలనీలో దస్తగిరి జెండా కట్ట స్థల వివాదంపై గురువారం ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో శుక్రవారం ఒక వర్గానికి చెందిన 24 మందిపై కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో మరో వర్గానికి చెందిన సునీత అనే మహిళ కులం పేరుతో దూషించారని ఫిర్యాదు చేయడంతో శనివారం భాగ్యమ్మ, అనిల్, పద్మపై ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు చేశారు.

నలుగురిపై కేసు నమోదు..

యల్లనూరు: లింగాల మండలం అంకేవానిపల్లికి చెందిన మన్నెల సురేష్‌పై దాడి చేసిన నలుగురిపై కేసు నమోదు చేశామని పోలీసులు శనివారం తెలిపారు. యల్లనూరుకు చెందిన పెద్దన్న, పెద్దిరాజు, నరేష్ వెంకట రమణ తదితరులు.. సురేష్‌ను కొట్టి గాయపరిచారు. క్షతగాత్రుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.

వరిపై తెగుళ్ల దాడి

- గ్రామాల వైపు కన్నెత్తి చూడని వ్యవసాయాధికారులు
- ఫర్టిలైజర్ షాపుల యజమానులను సంప్రదిస్తున్న రైతులు
- ఇష్టానుసారం పురుగుమందుల వాడకంతో తీవ్ర నష్టం



మందు పిచికారీ చేస్తున్న దృశ్యం



తెగుళ్లు సోకిన వరి పంట

రాప్తాడు: వరిపై తెగుళ్లు దాడి చేస్తున్నాయి. వాతావరణ మార్పులతో ఓవైపు వర్షాలు కురుస్తుండగా.. మరోవైపు వేసవిని తలపించేలా ఎండలు మండుతున్నాయి. దీంతో వరిపైరులో తెగుళ్లు విజృంభిస్తున్నాయి. నియోజకవర్గంలో దాదాపుగా 9 వేల ఎకరాల్లో వరి నాట్లు వేయగా.. 5 వేల ఎకరాల్లోని పంటకు తెగుళ్లు వ్యాపించినట్లు రైతులు చెబుతున్నారు. ఎక్కువగా పొడతెగులు, పచ్చ పురుగు, సుడిదోమ, తెల్లవీపు మచ్చ దోమ తదితర తెగుళ్లు వ్యాపించినట్లు రైతులు వాపోతున్నారు. పంటను కాపాడుకునేందుకు పలు సార్లు పురుగు మందులు పిచికారీ చేసినా ప్రయోజనం కనిపించలేదంటున్నారు.

అవగాహన లేమితో నష్టం..

వరికి సోకిన తెగుళ్లను నివారించుకునేందుకు అవసరమైన సలహాల కోసం రైతు సేవా కేంద్రాలకు వెళ్లినా సిబ్బంది స్పందించడం లేదని రైతులు వాపోతున్నారు. వరి పంటకు వచ్చిన తెగుళ్ల..నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాడాల్సిన పురుగు మందుల గురించి చెప్పేవారే కరువయ్యారని చెబుతున్నారు. ఆ క్రమంలోనే తప్పనిసరి పరిస్థితుల్లో పురుగు మందుల షాపుల యజమానులను ఆశ్రయిస్తున్నామని, వారి సలహా మేరకు మందులు పంటపై పిచికారీ చేస్తున్నామంటున్నారు. ఇదే అదునుగా కొందరు ఫర్టిలైజరు షాపుల నిర్వాహకులు ఇష్టానుసారం మందులను అంటగడుతున్నారని, దీంతో తెగుళ్లు తగ్గకపోగా ఆర్థికంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వ్యవసాయాధికారులు గ్రామాల్లో పర్యటించి రైతులకు తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరుతున్నారు.

సలహాలిచ్చే వారే లేరు



నేను మూడెకరాల్లో వరి సాగు చేశా. ప్రస్తుతం పంటకు పొడతెగులు, పచ్చ పురుగు, సుడిదోమ వ్యాపించడంతో పంటంతా నాశనమవుతోంది. తెగుళ్లతో పెట్టుబడులు కూడా భారీగా పెరుగుతున్నాయి. సలహా అడుగుదామంటే వ్యవసాయాధికారులు గ్రామాల వైపు రావడం లేదు. తప్పని సరి పరిస్థితుల్లో తెగుళ్ల నివారణకు ఫర్టిలైజర్స్ యాజమానులను ఆశ్రయిస్తున్నాం. నాలాగే చాలా మంది ఇలా మందులు వాడి నష్టపోతున్నారు.

– జూటూరు శేఖర్, రైతు, రాప్తాడు

యూరియా కూడా ఇవ్వలేదు



నేను రెండెకరాల్లో వరి సాగు చేశా. చీడ పీడలు వ్యాపించడంతో సలహాలు అడుగుదామంటే వ్యవసాయాధికారులు కనిపించడం లేదు. ఫర్టిలైజర్ షాపు నిర్వాహకుడు ఇచ్చిన మందులను వాడుతున్నా ఫలితం లేదు. వరికి యూరియా కావాలని అధికారుల చుట్టూ కాళ్లరిగిలే తిరిగినా బస్తా కూడా పంపిణీ చేయలేదు. గ్రామంలో టీడీపీ నాయకులకు మాత్రమే యూరియా పంపిణీ చేశారు.

– రామచంద్ర, రైతు, గాండ్లపర్తి, రాప్తాడు మండలం

మద్యం దుకాణాల్లో ఎక్సైజ్ అధికారుల తనిఖీలు

గుంతకల్లుటౌన్: రాష్ట్రంలో కూటమి నేతల నకిలీ మద్యం తయారీ కుంభకోణం వెలుగు చూసిన నేపథ్యంలో పట్టణంలోని మద్యం దుకాణాలను ఎక్సైజ్ అధికారులు తనిఖీ చేపట్టారు. శనివారం సాయంత్రం స్థానిక ఎక్సైజ్ సీఐ శివసాగర్, జిల్లా కేంద్రం నుంచి వచ్చిన పలువురు అధికారులతో కలిసి పట్టణంలోని హనుమాన్ సర్కిల్, రైల్వేస్టేషన్ రోడ్, ఆర్అండ్‌బీ సర్కిళ్లలో ఉన్న మూడు వైన్‌షాపుల్లో నకిలీ మద్యం, అధిక ధరల విక్రయాల గురించి ఆరా తీసినట్లు తెలిసింది. అయితే తనిఖీలకు సంబంధించిన విషయాలను మీడియాకు వెల్లడించేందుకు ఎక్సైజ్ అధికారులు నిరాకరించారు. షాపుల్లో మద్యం అధిక ధరలకు విక్రయాలు, వైన్‌షాపుల వద్ద అనధికార పర్మిట్‌రూమ్, బహిరంగ మద్యపానం సేవించే విషయాలు తెలిసినా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోకపోవడం పట్ల ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.